కుక్కతోక 'ఎపిసోడ్'

బైట ఓమాదిరి వర్షం కురుస్తోంది. వర్షం ఉధృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయ్. ఇంట్లోకి వెలిపిరి వస్తూ వుంటే , వీధి తలుపు వేసి లోపలికి వెళ్లిపోయింది నిర్మల. వంటగదిలో అడుగుపెట్టిందో లేదో కాలింగ్ బెల్ వినిపించిందామెకి. వర్షంలో ఎవరు వచ్చారా , అని ఆశ్చర్యపోతూ వెళ్లి తలుపు తెరిచింది నిర్మల.

ఎదురుగా తమ్ముడు కాశీపతి అగుపించేసరికి, ఆమె ఆశ్చర్యం ద్విగుణీకృతమైంది. చిరుగులు పడిన చిన్న గొడుగును ముడిచి గోడకి చేరవేసి, చెప్పుల్ని బయటే వదిలి లోపలికి వచ్చాడు కాశీపతి.

చాలారోజుల తర్వాత కనిపించిన తమ్ముడి కేసి క్షణంపాటు విస్మయంతో చూసింది నిర్మల. మాసిన గడ్డం, మాసిన దుస్తులు, సంస్కార విహీనంగా వున్న జుత్తు .... రూపమే మారిపోయినట్లనిపించిందామెకి. ఒకప్పుడు ఎంతో నీటుగా తయారయ్యే కాశీపతిలో ఇంతమార్పా? ఆమె సోదరి హృదయం తల్లడిల్లిపోయింది.

"ఏవిట్రా తమ్ముడూ ఈ వాలకం? ఏవిటిలా తయారయ్యావు? నాన్నగారి పరువు తీస్తున్నావు కదట్రా! " అంది నిర్మల, కాస్తంత కటువుగానే.

కాశీపతి అక్కకేసి తీక్షణంగా చూశాడు. "నాన్న ఊసెత్తకే అక్కా. ఆయన వల్లనే కదే నా జీవితం సర్వనాశనం అయ్యింది" అన్నాడు. జేబులోంచి మాసిన రుమాలు తీసి మొహం తుడుచుకుంటూ.

నిర్మల విస్తుపోయింది. తమ్మెడి మాటలకి. వాడు తండ్రిని అలా నిందించడం సబబుగా లేదనుకుంది."ఏవిట్రా నువ్వంటున్నది? నీభవిష్యత్తు నాశనం చేసింది నాన్నగారా? పరలోకంలో వున్న ఆయన మీద అభాండాలు వేస్తావేమిట్రా? చేతులారా నువ్వు చేసుకున్నదానికి ఆయనేం చేస్తారు?"

"అప్పట్లో లంచం కట్టివుంటే నాకు మంచి ఉద్యోగమే దొరికేది కదా! " కాశీపతి అభియోగం అది.

"లంచం కట్టడానికి ఆయన దగ్గర డబ్బుండాలి కదా! ఇంత సంసారాన్ని లాక్కొచ్చారు. అప్పట్లో నీకు ఆ ఉద్యోగమైనా దొరికింది. అందుకు సంతోషించు. దాన్నే నిలబెట్టుకోలేని స్థితికి వచ్చావు నువ్వు. ఇంకామంచి వుద్యోగం ఒహటా? ఇంతకీ నీ ఉద్యోగం ఉన్నాట్టా, ఊడినట్టా? మీ అవిడ ఎక్కడుంది? పిల్లడు బాగున్నాడా? " ప్రశ్నల వర్షం కురిపించింది నిర్మల.

కాశీపతి మొహం చిట్లించుకున్నాడు. భార్య పట్ల ఆక్రోశం ఉన్నట్టు ఆ మొహమే చెబుతోంది.

"మా ఆవిడకేం? హాయిగా వాళ్లమ్మగారింట్లో వుంటోంది, కొడుకుతో పాటు. ఎటొచ్చీ నా బతుకే అధ్వాన్నమయ్యింది" బాధగా అన్నాడు , చివరివాక్యం.

"అందుకు నువ్వే కదట్రా బాధ్యుడివి. నిక్షేపంలాంటి ఉద్యోగానికెళ్లకుండా పేకాట ఆడుతూ, మందుసేవిస్తూ, పోరంబోకు స్నేహితులతో కాలక్షేపం చేస్తూంటే , ఏ ఉద్యోగం ఉంటుంది? దేనికైనా ఓ పద్ధతి ఉంటుంది కదా! ఇంతకీ ప్రస్తుతం నువ్వు ఉద్యోగం చేస్తున్నట్టేనా? లేక..."అని ఇంకేదో అనబోతూ వుంటే కాశీపతి అందుకున్నాడు.

"ఇంకా డ్యూటీలో జాయిన్ కాలేదక్కా!

పాఠకులకు మనవి

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక సోమవారం మార్కెట్లోకి విడుదలవుతుంది. మీ ఊళ్లో, మీదగ్గరి షాపులో ఆరోజున విడుదల కాకపోతే దయచేసి ఈ కింది చిరునామాకు తెలియచేయండి.

సీనియర్ సర్క్యులేషన్ మేనేజర్,
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక,
ఎక్స్‌ప్రెస్ సెంటర్, లోయర్ టాంక్‌బండ్,
దోమల్‌గూడ, హైదరాబాద్-29.
ఫోన్: 3223586, 3226058.

-ఎడిటర్.

డాక్టరు సర్టిఫికెట్ వుంటేనేగాని డ్యూటీలోకి తీసుకోరట! డాక్టరుతో మాట్లాడాను. అతనికీ డబ్బు కావాలి. దాంతో బయట పడతామా అంటే , డ్యూటీలోకి ఏ రిమార్కూ లేకుండా తీసుకోవడానికి లంచం. నీకు తెలీందేముందక్కా? ఈ రోజుల్లో లంచం లేనిదే ఏపనీ జరగదు. అందుకే నీదగ్గరికి వచ్చాను. ఈ ఒక్కసారినన్ను ఆదుకో అక్కా! నేను డ్యూటీలో జాయినయ్యాక, తీసుకున్న మొదటి జీతంలో డబ్బు తెచ్చిస్తాను. బావతో చెప్పకు'' అన్నాడు.

"మీ బావతో చెప్పకుండా నేను ఎక్కణ్నించి తెస్తాన్రా డబ్బు?''

"నువ్వు ఎలాగోలా సర్దుబాటు చేసుకో అక్కా! ఇప్పుడు నాకు బుద్ధొచ్చింది. ఉద్యోగంలో లేకపోతే ఎంతమంది ఎన్ని విధాల నన్ను కించపరుస్తున్నారో, పరోక్షంలో నవ్వుకుంటున్నారో, అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. నామీద నాకే అసహ్యమేస్తోంది. నేను మళ్లీ మొదటి కాశీపతిని కావాలి. అదే నా పట్టుదల. అందరిలో నేనూ బతుకుతాను. ఈ ఒక్కసారి సహాయం అందించు అక్కా! నువ్వు తప్పించి నా శ్రేయస్సు కోరేవాళ్లు ఇంకెవరున్నారు చెప్పు?'' కంట తడిపెట్టుకున్నాడు కాశీపతి.

నిర్మల హృదయం మంచుముక్కలా కరిగిపోయింది. తల్లి బతికున్న రోజుల్లో , ఎప్పుడూ వీడి గురించే బాధపడ్డం, ఆమెకి ఇప్పటికీ గుర్తుంది. ఇప్పటికయినా వీడిలో మార్పు వచ్చినందుకు ఆమె ఆనందించింది.

తమ్ముడి పరిస్థితికి జాలి కలిగిందామెకి. వాడన్నట్లు వాడికి ఇంకెవరున్నారు ఆదుకునే వాళ్లు! తనే ఆదుకోవాలి మరి! సహాయం చెయ్యాలనే నిశ్చయించుకుంది.

"తమ్ముడూ, నువ్వు అంటున్నట్లు నిజంగా నీలో మార్పువస్తే నా కంటే ఆనందించే వాళ్లెవరుంటార్రా? సరే ఇప్పుడు ఎంత డబ్బు కావాలి?''

"ఎంతో కాదక్కా! ఓ అయిదు వందలు ఇస్తే చాలు. నీకు మళ్లీ తిరిగి ఇచ్చేస్తాను. నన్ను నమ్ము. పాత కాశీపతిగా చెప్పడంలేదే .. మారిన కాశీపతిగా చెప్తున్నాను'' ఉత్సాహంగా అన్నాడు కాశీపతి.

"బావ రానీయ్‌రా అడిగి ఇస్తాను.''

కాశీపతి విసుగ్గా మొహం పెట్టాడు. "మళ్లీ పాతపాటే పాడుతున్నావేంటే అక్కా. నీకు తెలుసును కదా? నా పేరు వింటేనే బావకి ఒళ్లు మంట. అసలుకే మోసం వస్తుంది. అంచేత నువ్వే సహాయం చేసి, తర్వాత బావతో చెప్పు. నీ మాట కాదనడులే. అక్కా...అక్కా....ఈ ఒక్కసారికి సహాయం చెయ్యవే'' ప్రాధేయపడ్డాడు కాశీపతి.

నిర్మల కాదనలేకపోయింది.

"సరేలేరా! నువ్వింతగా ప్రాధేయపడుతున్నావు కాబట్టి, నువ్వు మారిపోయినట్టు చెబుతున్నావు కాబట్టి, నీకు కనువిప్పు కలిగినట్టు నాకు అనిపిస్తోంది కాబట్టి, నీ పరిస్థితులకు జాలిపడి సహాయం చేస్తాను. నీకు జీతం అందిన వెంటనే ఆ డబ్బు ఇచ్చేయాలి'' అంది నిర్మల.

"ఆపాటి నమ్మకం నామీద లేదా అక్కా! చెప్పాను కదా, నీడబ్బు పువ్వుల్లో పెట్టి తెచ్చిస్తాను. మారిన కాశీపతిగా వాగ్దానం చేస్తున్నాను. భగవంతుడి మీద ఒట్టు వెయ్యమంటావా చెప్పు?''

"ఎందుకులేరా? నీ మాటమీద నువ్వు నిలబడితే అంతే చాలు! నువ్వు బాగుపడ్డమేరా మేం కోరుకునేది. ఆ విధంగానైనా అమ్మ ఆత్మకు శాంతి చేకూరుతుంది.''ఆమె గొంతు చివరివాక్యం చెబుతున్నప్పుడు బొంగురుపోయింది.

కాశీపతి కళ్తొత్తుకున్నాడు. తల్లి గుర్తుకొచ్చి కంటతడిపెట్టుకు న్నాడనుకుంది నిర్మల.

"నా అభిప్రాయం కూడా అదే అక్కా! చేసిన తప్పు సరిదిద్దుకోవాలన్న సంకల్పం, నాలో స్థిరంగా ఏర్పడిందే అక్కా! ఈ అవకాశం ఇచ్చి చూడు'' అన్నాడు కాశీపతి.

నిర్మలకి తమ్ముడి పట్ల మరింత విశ్వాసం ఏర్పడింది వాడి పట్టుదల చూసి.

"సరేలేరా తమ్ముడూ! ఏనిటా వాలకం? ఓ సారి అద్దంలో చూసుకో. బాత్రూమ్‌కి వెళ్లి మొహం కడుక్కురారా.... భోంచేసి వెళ్లు.....''

అంది నిర్మల.

కాశీపతికి అప్పుడు భోంచేయడం ఇష్టం లేదు. ఈ లోగా బావ వస్తాడేమో నన్న భయం గుండెలో మెదుల్తూనే ఉంది. ఆయనొస్తే అక్క ఇస్తానన్న డబ్బు తనచేతిలోకి రాదేమోనన్న సందేహం వచ్చింది.

"ఇప్పుడు భోజనం ఏవిఁటక్కా? వేళకాని వేళ. అసలు ఉద్యోగం మీద ఆసక్తి వల్ల నిజానికి ఆకలే వెయ్యడం లేదు. డాక్టరుదగ్గర సర్టిఫికెటు ఎంత త్వరగా తీసుకెళ్లి జాయినవుతానా అన్న ఆరాటం నాలో ఉరకలు వేస్తోంది. భోజనం చెయ్యను గాని ఓ కప్పు కాఫీ ఇవ్వు చాలు. నువ్వు ఇచ్చే డబ్బే ఈ తరుణంలో నాకు పంచభక్ష్యపరమాన్నాలతో కూడిన భోజనం అనుకో.'' ఆసక్తితో అన్నాడు కాశీపతి.

ఉద్యోగంలో చేరడానికి తమ్ముడు ఎంత ఆరాటపడుతున్నాడో అర్థంచేసుకోగల్గింది నిర్మల.

"పోనీ బాత్రూమ్‌కి వెళ్లి మొహమైనా కడుగుతావా?'' అడిగింది నిర్మల.

"నేనేం పెళ్లిచూపులకు వెళ్లడం లేదు లేవే! ఈ వర్షపు వాతావరణంలో ఎలావుంటే ఏం లెద్దూ! ఆ డబ్బేదో నామొహాన కొట్టి ఓ కప్పు కాఫీ ఇవ్వు చాలు''

నిర్మల నవ్వుకుంది. చరచరా లోపలి గదిలోకి వెళ్లి బీరువా తెరిచింది. లాకర్‌లో ఉన్న పర్సుతీసి అందులోంచి అయిదువందల రూపాయల నోట్టు వెలికి తీసింది. ఇంకా పర్సులో ఉన్న డబ్బు ఓసారి లెక్కపెట్టింది. మరో అయిదువందలున్నాయి అందులో. వాటిని అందులో వుంచేసి తన చేతిలో ఉన్న అయిదువందలతో గదిలోంచి బైటికి వచ్చింది.

"ఇవిగోరా అయిదువందలు. బుద్ధిగా ఈ అయిదువందలు తీసికెళ్లి ఎవరెవరికి ఇవ్వాలో ఇచ్చేసి, లక్షణంగా ఉద్యోగంలో చేరు.'' అంటూ ఆ నోట్లను తమ్ముడికి అందించింది.

కాశీపతి, ఆడబ్బుని లెక్కపెట్టుకుని, కళ్లకి అద్దుకుని, జేబులో పెట్టుకున్నాడు. అతని

హృదయం ఉప్పొంగిపోయింది.

"అక్కా! నీ దగ్గర డబ్బు తీసుకున్నందుకు నాకే సిగ్గుగా ఉందే! కాని, ఏంచేస్తాను? అత్యవసర పరిస్థితిలో తీసుకోవాల్సి వచ్చింది. కష్టకాలంలో నన్ను ఆదుకున్నావు. అందుకు ధన్యవాదాలు చెప్పుకోకుండా ఉండలేను. ఉద్యోగంలో చేరి జీతం తీసుకున్న వెంటనే నీ డబ్బుని పువ్వుల్లో పెట్టి ఇచ్చేస్తానే" అన్నాడు కృతజ్ఞతాభావంతో.

నిర్మల తృప్తిగా నవ్వుకుంది.

"దానికేంలే గాని, కూచో కాఫీ తీసుకుని వస్తాను." అంటూ వంటగది వైపు నడిచింది.

నిశ్శబ్దవాతావరణం.....బైట ఇంకా వర్షం కురుస్తూనే వుంది. నిర్మల కాఫీతో పాటు బిస్కెట్లు కూడా తెచ్చి తమ్ముడికి అందించింది.

కాశీపతి ఆదుర్దాగా బిస్కెట్లు తినేసి, కాఫీ తీసుకుని లేచాడు.

"నీ మేలుని ఈ జన్మలో మరిచిపోనే అక్కా! నేరుగా వెళ్లి నా ఉద్యోగ ప్రయత్నాలు చెయ్యాలి. మరి వెళ్లొస్తానే" అన్నాడు కాశీపతి.

"వర్షం పడుతోందిరా. తగ్గేవరకూ ఉండకూడదూ!"

"కాలం చాలా విలువైనదక్కా! నాకు బోలెడు పనులున్నాయికదా! వర్షం ఏం చేస్తుంది? గొడుగు ఉండనే వుంది" అంటూ గొడుగు వేసుకుని బయటికి నిష్క్రమించాడు.

లోపల్నించే వెళ్లిపోతోన్న తమ్ముడి వేపు చూస్తూ ఒక్కక్షణం ఉండిపోయింది. వచ్చినప్పుడు కంటే వెళ్తున్నప్పుడు కాశీపతి ఎన్నో రెట్లు ఉత్సాహంగా ఉండటాన్ని గమనించింది నిర్మల. ముసిముసిగా నవ్వుకుంది. వాడేదో తోవపడితే అంతేచాలు.....అనుకుంది. తలుపు వేసుకుని లోపలికి వెళ్లిపోయింది నిర్మల.

***

మర్నాడు పదిగంటలు కావస్తోంది. ఉదయం వర్షం తగ్గింది. సూర్యుడు తొంగిచూస్తున్నాడు.

నిర్మల భర్త రాఘవేంద్రరావు వీధిలో వెళ్తూ భార్యని కేకవేశాడు.

"ఏవండీ?" అనుకుంటూ వచ్చింది నిర్మల.

"కరెంటుబిల్లు కట్టేస్తాను. ఓ రెండువందలు ఇవ్వు నిర్మలా..." అన్నాడు.

నిర్మల లోపలికి వెళ్లి బీరువా తాళం తెరిచి లాకర్ తీయబోయింది. లాకరు తాళం తెరిచేవుంది. తనే నిన్న వెయ్యడం మరిచిపోయి ఉండొచ్చుననుకుంది. లాకర్ తెరిచి పర్సుతీసింది. నిర్ఘాంతపోయింది. పర్సు ఖాళీగా ఉంది, వెక్కిరించినట్టనిపించిం దామెకు. స్థాణువులా క్షణం సేపు వుండిపోయింది. ఇది కాశీపతి నిర్వాకమే అయివుంటుంని, ఊహించుకుందుకు ఆమెకి ఎక్కువ సమయం పట్టలేదు. హతాశురాలయ్యింది. తమ్ముడు మారిపోయాడని, వాడికి కనువిప్పు కలిగిందని భ్రమ పడినందుకు తనని తానే తిట్టుకుంది. ఆమె కళ్లు చెమ్మగిల్లినయ్.

భార్య అంత ఆలస్యం ఎందుకు చేసిందోనని లోపలికి వచ్చాడు రాఘవేంద్రరావు.

శిలాసదృశంగా నిల్చుని కళ్లొత్తుకుంటున్న భార్యని చూసి విస్తుపోయాడు. ఆమె ఆవేదనకి హేతువేమిటో అతనికి అర్థం కాలేదు.

"ఏమయింది నిర్మలా? కంటతడిపెట్టుకుంటున్నావేవిఁటి?"అన్నాడు రాఘవేంద్రరావు, భార్యకి దగ్గరగా వచ్చి, ఆమెని ఆశ్చర్యంగా చూస్తూ.

నిర్మల బావురుమంటూ భర్త వక్షస్థలం మీద వాలిపోయింది.

"నన్ను క్షమించండీ... మీతో చెప్పకండా ఓ పొరబాటు చేశానండీ! నిన్నను మీరు లేనప్పుడు మా తమ్ముడు కాశీపతి వచ్చాడండీ.. వాడు ఉద్యోగానికి వెళ్లడం లేదనుకున్నాం కదా! డాక్టరు సర్టిఫికెట్ తీసుకుని ఉద్యోగంలో చేరాలంటే ఓ అయిదువందల రూపాయలు ఉండాలటండీ... ఈ ఒక్కసారికి ఆ సహాయం చేయ్యమని ప్రాధేయపడ్డాడు. తన తప్పు తెలుసుకుని పశ్చాత్తాపపడుతున్నట్లుగా వ్యవహరించాడండీ. కంటతడిపెట్టుకున్నాడు. వాడి పరిస్థితి చూసి జాలిపడ్డాను. వాణ్ని పూర్తిగా విశ్వసించి పర్సులోని అయిదువందలు తీసి వాడికిచ్చాను. పర్సులో ఇంకా అయిదువందలుండాలి. నేను కాఫీ చేసివాడికిచ్చేలోపల పర్సులో ఉన్న మిగిలిన అయిదువందలూ తస్కరించినట్టున్నాడు. వాడు మారిపోయాడని సంబరపడ్డాను. కాని...కాని...వాడు మారలేదండీ...వాణ్ని నమ్మినందుకు నన్ను క్షమించండీ!" అని రోదిస్తూ అంది నిర్మల.

రాఘవేంద్రరావు బరువుగా ఓ నిట్టూర్పు విడిచాడు. సొంత అక్కనే మోసగించిన కాశీపతిపై వల్లమాలిన కోపం వచ్చిందతనికి. కాని, ఇప్పుడేం చెయ్యగలడు?

"బాధ పడకు నిర్మలా! జరిగిందేదో జరిగింది. ఇప్పుడు అనుకుని ప్రయోజనం ఏముంది? మీ తమ్ముడు కాశీపతి గురించి తెలిసికూడా వాడ మాయమాటల్లో పడి మారిపోయాడని భ్రమ పడ్డావు. కుక్కతోక ఎప్పుడైనా తిన్నగా అవుతుందా? పోనీలే. ఇదీ ఒకందుకు మంచిదే అయ్యింది. మళ్లీ వాడి మొహం నీకు చూపించడు. వెయ్యి రూపాయలు పోతే పోయాయి. పరోక్షంగా మంచే జరిగిందనుకో!నువ్వేం బాధ పడుకు. కళ్లు తుడుచుకో.." అన్నాడు రాఘవేంద్రరావు మందస్మితవదనంతో.

భర్త మంచితనానికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంది నిర్మల..కాశీపతి పట్ల ఏహ్యాభావం పెరిగిందామెలో. "ఎంతమంచివారండీ... మీరు" అంది. చిరునవ్వుతో .

రాఘవేంద్రరావు ముసిముసి నవ్వుకుంటూ బైటికి నిష్క్రమించాడు.

నిర్మల చీరచెంగుతో మొహం ఒత్తుకుంది.

■